

# తీర్పు

ఈరంకి వెంకటరావు

సుందరరామయ్య తన గదిలో పడక కుర్చీలో కూర్చొని మరునాడు ఆర్గ్యుమెంట్లు వినవలసిన కేసుఫైళ్ళూ, దావా రికార్డులూ చూసుకుంటున్నాడు. రాత్రి పదిగంటలవుతుంది. మరో అరగంట రికార్డులు చూసుకొని పడుకుందామని సుంగరరామయ్య అనుకున్నాడు. సివిలు దావాల రికార్డులు చదువుతుంటే క్రిమినలు కేసుల రికార్డులు ముఖ్యంలాగా, క్రిమినలు కేసుల రికార్డులు చదువుతుంటే సివిలు

రికార్డులు ముఖ్యంలాగా అతనికి అని పిస్తోంది. ఎటూ నిర్ణయించుకోలేకుండా నే అన్ని కట్టలూ తలో పదినిమిషాలు తిరగ వేసి చూస్తున్నాడు. శాంతమ్మ అరగంట క్రితం ఆ గదిలో పెట్టివెళ్ళిన పాల గ్లాసు అలాగే వుంది. ఆమె పాలు తాగమని చెప్పినపుడు "ఊ" అన్నాడు. ఆ తరువాత ఆ పాలగ్లాసు మాచే దృష్టిలో లేదు.

ఆ సమయంలో శాంతమ్మ ఖాళీగ్లాసు పట్టుకుపోవడానికి మళ్ళీ వచ్చిన సంగతి సుందరరామయ్య గమనించనేలేదు. భర్త తన రాక గమనించకపోవడం, పాలు తాగకపోవడం నిజంగా అతను పనిలో లీనమై గమనించకన, లేక తీరుబాటులేకనా అని ఆమె విస్తుబోయి చూసింది. అలాగ ఎంతసేపు నిలుచున్నా అతను పలక రించేలాగ లేదని తేల్చుకున్నాక, ఆమె చిన్న పొడిదగ్గు దగ్గింది. ఆ దగ్గుతో సుందరరామయ్య తలెత్తిచూసి, "నువ్వా, ఏం యిలా వచ్చావు?" అన్నాడు.

ఆ ప్రశ్నకు శాంతమ్మ నవ్వింది. "ప్లీడర్లకు, జడ్జీలకు, ప్రొఫెసర్లకు మతి మరుపు వుంటుందనేమాట ఊరికే పుట్ట లేదన్నమాట. అది నిజమేనని ఋజువు చేశారు. ఇంకా మీరు కొంత నయమే 'నువ్వెవరు?' అని అడగలేదు. నేను యీ గదిలోకి రావడం రెండోసారి. రోజూ యీ టైముకి మీరు పాలు తాగు తారుగదా! పాలు అక్కడ పెట్టాను. మీరు తాగేరేమో గ్లాసు తీసుకువెడదా మని వచ్చాను. మీరింకా పాలే తాగలేదు. ఏం, యిలా వచ్చావు అని అడుగుతారేమి టండీ" అన్నది.

"పాలా, యిలా అందివ్వు" అని అందిపుచ్చుకొని గడగడ తాగేశాడు. ఖాళీగ్లాసు శాంతమ్మకి యిచ్చేసి, 'యింక వెళ్ళు' అన్నట్లు చూశాడు. శాంతమ్మ కదలలేదు. పైగా దగ్గలో వున్న యినప కుర్చీ లాక్కొని కూర్చొంది.

"ఏమండీ యీ గదిలో నేను అడుగు పెడితే అలా కంగారుపడతారేం" అని అడిగింది.

"కంగారా, అబ్బే కంగారేముంది. నాకు చదవవలసిన రికార్డు చాలావుంది. నీతో మాట్లాడకపోతే బాగుండదు. మాట్లాడుతూ కూర్చుంటే పని తెమలదు" అన్నాడు.

"పని తెమలకపోతే మాత్రం మిమ్మల్ని ఎవరు కోసి కొరతవేస్తారు? మీ కోర్టుకు మీరే అధిపతిగదా. ఎవరో అస్తమానూ కర్రపుచ్చుకొని తరుము కొచ్చినట్లుగా, పడగెత్తుతున్నట్లుగా పని చేస్తారేమిటండీ. మీకు గవర్నమెంటు జీతమిస్తే కోర్టులో పనిచేస్తున్నారు చాలదూ? ఇంటిదగ్గరకూడా ఆ కాగితాలు దగ్గరేవేసుకొని కూర్చోవాలా?" అన్నది.

"నువ్వు చెప్పినదాంట్లో కొంత యదార్థం లేకపోలేదు. నన్ను కాలమూ, కర్తవ్యమూ తరుముతున్నాయి.

మనుష్యులు ప్రత్యక్షంగా తరమడం లేదు. నేను ఏ రోజున చెయ్యవలసిన పని ఆ రోజున చేస్తూవుంటే, అది ఎవరికో భయపడి చేస్తున్నానని అర్థంకాదు. ఒక కేసుగాని, దావాగాని అనవసరంగా వాయిదా వేస్తే కోర్టుకువచ్చే పార్టీలకు ఎంత కష్టమో, నష్టమో నీవు ఊహించలేవు. ఆలస్యంగా జరిగించిన న్యాయం, న్యాయం జరిగించనట్లేనని 'Justice delayed is justice denied' అని ఒక్కమాటలో చెప్పారు. అందువల్ల ఎవరికీ యిబ్బంది కలుగకుండా నా పని నేను తెముల్చుకోవడంలో నష్టమేముందీ. ఇంట్లోచేసినా, ఆఫీసులోచేసినా యీ పని ఎప్పుడో ఒకప్పుడు నేను చేయ్యవలసిందేగదా. ఈ పని నేను యింకొకరి సాయంతో పూర్తిచేసేది కాదు గదా, స్టెనోగ్రాఫరుకి జడ్జిమెంటు డిక్టేటు చేసేటప్పుడు తప్ప," అన్నాడు.

"నాకు సమాధానం చెప్పే తెలివితేటలు మీ దగ్గర వున్నాయి. అదికాదు, నేనసేది. ఎంత ప్రభువ్వమైతే మాత్రం పెళ్ళాంబిడ్డల్ని పలకరించకుండా, వారి మంచిచెడ్డలు చూడకుండా మిమ్మల్ని పాటుపడమన్నారుటండీ. అందరూ యిలాగే, మీలాగే ఉద్యోగాలు చేస్తున్నారా?"

"ఒకరిలాగ యింకొకరెలా వుంటారు. నాకన్నా కష్టపడి పనిచేసేవారుంటారు. హైకోర్టు జడ్జీలే నాకంటే ఎక్కువ కష్టపడి పనిచేసేవారున్నారు. నేను పెళ్ళాంబిడ్డల్ని వారి అవసరాలని చూడకుండా పనిచేస్తున్నానని నా మట్టుకు నేను అనుకోవడంలేదు. నేనూ సంసారినే గాని, సన్యాసం తీసుకోలేదుగా. నా కోర్టుకి భర్తచేత వదలివేయబడిన భార్యలు వచ్చి కేసులూ, దావాలూ వేస్తూవుంటారు. ఆ భర్తల కర్తవ్యం బోధించేవాడిని నా కర్తవ్యం నేను మరచిపోతానా?"

"అది కాదండీ, నే నన్నది. ఇంత కూడూ, గుడ్డా యిచ్చి, లేకపోతే నెల అయ్యేసరికి రూపాయలు చేతుల్లో పోసి, 'నా కర్తవ్యం నేను నెరవేరుస్తున్నా'నని అనుకుంటే ఎలాగ? భార్యాబిడ్డలయందు ఆదరణ, అప్యాయత, వారితో కలిసి మెలిసి వుండడం యివన్నీ కోరుకోరా. అలా వారితో వుండడం మీకు వీలవదా? మీరు న్యాయనిర్వహణ చేస్తున్నారని వూళ్ళోవాళ్ళని దూరంగా వుంచినట్లు యింట్లోవాళ్ళనిగూడ దూరంగా వుంచుతున్నారనే అనుమానం నాకు మీరు యీ ఉద్యోగంలో ప్రవేశించిన దగ్గరనుంచీ వుంది. రోజురోజుకీ ఆ ఉద్దేశ్యం బలపడుతోంది. మాతో మాట్లాడితేనే మీ ఉద్యోగధర్మ నిర్వహణలో ఏమిలోపం వస్తుందోనని మీరు భయపడుతున్నట్లుగా నాకు అనిపిస్తూ వుంటుంది. మీరు యీ ఉద్యోగం చేస్తున్నారంటే, ఏదో పెద్ద ఆఫీసరుగారి పెళ్ళాన్నని మురిసిపోవల

సిందేగాని మీరు ప్లీడరీచేసినపుడు మీలో వుండే ఆప్యాయత, ప్రేమ, ఉత్సాహం అన్నీ మచ్చుకైనా యిప్పుడు మీలో కనపడడం లేదు. ఆ రోజులే బాగుండేవి." అని తన మనసులో బాధంతా చెప్పి నిట్టూర్చింది.

"అలా అనుకోవడం మానవ సహజం. వ్యవసాయదారుడికి ఉద్యోగస్థుడి పని బాగున్నట్లు అనిపిస్తుంది. ఉద్యోగస్థుడికి వ్యవసాయదారుడి పని బాగున్నట్లు అనిపిస్తుంది. ప్లీడరుకి జడ్జీ అయితే బాగుండుననిపిస్తుంది. జడ్జికి ప్లీడరుపనే బాగున్నట్టు అనిపిస్తుంది. నేను నా పని ఒత్తిడివల్ల యింట్లోవాళ్ళతో యిదివరకులాగ ఎక్కువసేపు మాట్లాడక పోతే పోవచ్చు. అలాగని నేను నా చుట్టూ గిరిగీసుకుని కూర్చున్నానని మీరెవరైనా అనుంకుంటే అది పొరబాటే అవుతుంది. ఏదో ఒక అభిప్రాయం ముందుగానే ఏర్పరచుకొని, ప్రతి విషయాన్నీ దానికి అనుకూలంగానే చిత్రించుకుంటూ వుంటే, ఇక దానికి భిన్నంగా చూడడం గాని, అవగాహన చేసుకోవడం గాని జరగదు. ఇంతకీ నువ్వు యీవేళ యీ విధంగా మాట్లాడడంలో ఏదో విశేషం వుంటుంది. అదేదో సూటిగా చెప్పరాదూ— సూటీ పోటీ మాటలు వదిలేసి."

"ఏం, మీ టైము వృధా అవుతుందా? నేను యదార్థం మాట్లాడితే మీకు సూటీ, పోటీ మాటల్లాగే వుంటుంది. నేను మాట్లాడితేనే మీకు చికాకుగా వుంటుంది. మీపని చూసుకోండి, నేను వస్తాను," అని శాంతమ్మ విసురుగా లేవబోయింది.

సుందరరామయ్య పడకకుర్చీలో నుంచే ఆమెను చెయ్యిపట్టుకొని కూర్చో బెట్టాడు. "మీవాళ్ళు నీకు శాంతస్వభావురాలి వవుతావనే నీకు శాంతమ్మ అని పేరు పెట్టివుంటారు. ఆ పేరుని సార్థకం చేసుకో. ఇంతకీ నువ్వు మాట్లాడదలుచుకొన్నదేమిటో చెప్పావుగాదు. అసలు విషయం వదిలేసి నాందీప్రస్తావనలోనే కోపం తెచ్చుకొని వెళ్ళిపోవడం కార్యదక్షుల లక్షణంగాదు." అన్నాడు సుందరరామయ్య.

శాంతమ్మకు కోపం తగ్గింది గాని, ఉక్రోషం తగ్గలేదు. తాను చెప్పిన ప్రతి దానికీ తన భర్త ఏదో సమాధానం చెబుతూనే వున్నాడు. మున్సిఫ్‌గాను, ఫస్టు క్లాసు మేజిస్ట్రేటుగాను పనిచేస్తూ సివిలు, క్రిమినలు తగాయిదాలు వింటూ, రోజూ ఎంతోమంది ప్లీడర్ల అడ్డుసవాళ్ళతో తల దిమ్మెక్కిపోయేలాగా వినే తన భర్తతో తాను చెప్పదలచుకొన్న విషయం ఆమెకు ఎలా ప్రారంభం చెయ్యాలో అర్థం కాలేదు. తాను ప్రస్తావించి భర్త దగ్గర నుంచి వరం పొందుదామనుకొన్న విషయం అసలు ఎత్తుకోకుండానే సంభాషణ బెడిసికొట్టేలాగా కనపడింది. ఐనా సుందరరామయ్య ఏవో అనునయ

వాక్యాలు పలకడంవల్ల వాటిని ఆధారం చేసుకొని తన మనసులో వున్న కోరిక ఏదో విధంగా అతనికి చెప్పి తన పని సాధించాలని అనుకున్నది.

"మీరు యిన్ని దావాలు, యిన్ని కేసులూ రోజూ విచారణ చేస్తూవుంటారు గదా, ఎప్పుడైనా యీ ఆరేళ్ళలోను మీకు వింతగా వున్నదో, నిర్ణయించడానికి కష్టసాధ్యమైనదో, ప్రజలు వింతగా చెప్పుకుంటూ వున్నదో ఒక్క కేసైనా, ఎప్పుడైనా నాకు చెప్పారా." అన్నది శాంతమ్మ.

"ఏమిటో యీ కేసులూ, దావాలూ చూసి యిదంతా ఒక తలనొప్పి వ్యవహారమని నేను నిత్యమూ అనుకుంటూ వుంటే, యీ తలనొప్పి నీకూ కొంత ట్రాన్స్ఫరు చెయ్యమంటావు. నిజం చెప్పాలంటే ఏదైనా ఒక దావాగాని, కేసుగాని నీకు చెపితే నువ్వు విని వూరుకొంటే ఫరవాలేదుగాని, నువ్వు జాలిపడి 'అయ్యో పాపం యిలా చెయ్యకూడదుటండీ' అని అంటావేమోనని నా భయం. కేసులో వున్న సాక్ష్యం దృష్ట్యా, చట్టరీత్యా నువ్వు అనుకొన్న ప్రకారం చెయ్యడానికి వీలులేకపోవచ్చు. నువ్వు అనుకొన్న ప్రకారం చెయ్యకపోతే నీకు అసంతృప్తి కలగవచ్చు, లేదా నా నిర్ణయంలోని మంచి, చెడులను నీవు శంకించవచ్చు. ఎందుకొచ్చినదీ బెడదంతా. నేను నిన్ను సంప్రతించి తీర్పులు చెబుతున్నానని ఏమాత్రం పొక్కినా నీకు వచ్చే అశ్రయింపులూ నీ రికమండేషనులూ ఎక్కువై పోతాయి" అన్నాడు.

"పోనీలెండి అన్నిటిమాట నాకెందుకు గాని, ఇప్పుడు మీ కోర్టులో కో-ఆపరేటివ్ బ్యాంకు సెక్రటరీ ఆదినారాయణరావు డబ్బు వాడేసుకున్నాడని కేసేదైనా నడుస్తోందా" అన్నది శాంతమ్మ.

శాంతమ్మ ఉన్నట్టుండి సూటిగా అడిగిన ప్రశ్నకు సుందరరామయ్య చకితుడైనాడు. శాంతమ్మకు యీ కేసు సంగతి ఎలా తెలిసిందా అని, యీ కేసు గురించి అడగవలసిన అవసరమేమొచ్చిందా అని ఆశ్చర్యపోయాడు. తన కోర్టు వ్యవహారాల గురించి ఆమె అనవసరంగా జోక్యం కలుగజేసుకుంటోందని ఆయనకు కోపమూ వచ్చింది. ఐతే తన కోపాన్ని బయట పెడితే తాను తెలుసుకోవలసిన సమాచారాన్ని తెలుసుకోలేనని తన కోపాన్ని, ఆశ్చర్యాన్ని బయటకు కనిపించకుండా ఉగ్గబట్టాడు.

"ఐతే యీ విషయం గురించన్నమాట యింత ఉపోద్ఘాతం నడిపావు. అయినా యీ కేసు నా కోర్టులో వున్నదని నీ కెలా తెలుసు? నా ఆఫీసు రికార్డులు నువ్వు తిరగేస్తున్నావా?" అని అడిగాడు.

"అమ్మో, మీ ఆఫీసు రికార్డు నేను




ముట్టుకోవడమే ? అయినా నా ప్రశ్నకు సమాధానం చెప్పాలి గాని, ప్రశ్నకు మరో ప్రశ్న సమాధానం కాదుగా" అన్నది శాంతమ్మ.

"ఇది కోర్టులో సాక్షులు సమాధానం చెప్పకుండా తిరిగి ప్లీడరును ప్రశ్నిస్తే ప్లీడర్లు అడిగే విధానం. కాని యిది కోర్టూ కాదు, నేను సాక్షినీ కాను, నువ్వు ప్లీడరువూ కాదుగా. నువ్వు కొన్ని విషయాలు–అందులోనూ బొత్తిగా నీకు సంబంధం లేని విషయాలు తెలుసుకోవడానికి కుతూహలం చూపెడుతున్నపుడు, ఆ విషయం నీ నోటీసులోకి ఎందుకు వచ్చిందో, ఎలా వచ్చిందో, ఆ విషయం తెలుసుకోవలసిన అవసరమేమిటో తెలుసుకోవలసిన బాధ్యత నాకు వున్నదని నువ్వు గ్రహించాలి."

"పోనీలెండి మీకు చెప్పడం యిష్టం లేకపోతే మానెయ్యండి. నేను ఎప్పుడో అనుకున్నాను, మీ చుట్టూ గిరిగీసుకొని కూర్చొంటారనీ, అందులోకి చీమనైనా దూరనివ్వరనీ. ఈనాడు మీరు మారాలని అనుకొంటే ఎలా మారతారు." అన్నది కోపంతో పరుషంగా.

"ఆహా ! ఆహా !! నేను కోపం తెచ్చుకోవలసిన ఘట్టంలో నువ్వు కోపం తెచ్చుకుంటున్నావు. ఆడవాళ్ళ చాకచక్యం అక్కడే వుంది. నీ కోపం అనే ఆయుధాన్ని ప్రయోగించి, నాకు కోపమో, జాలో తెప్పించి నీ అభిప్రాయానికి అనుగుణంగా నన్ను మళ్ళించాలని నీ ఉద్దేశ్యం. కాని నీకు అంత శ్రమ అక్కరలేదు. నీకు అది నారాయణరావు కేసు గురించి ఏమి కావాలో అన్నీ చెబుతాను. కాని ఏది ఏమైనా సరే నువ్వు మాత్రం ఆ కేసు విషయంలో 'యిలా చెయ్యండి, అలా చెయ్యండి' అని అడగడానికి మాత్రం

విలులేదు. నా బుద్ధికి ఎలాగ తోస్తే అలాగ చేస్తాను." అన్నాడు.

"అంటే నేనేదో మిమ్మల్ని అడుగు తానని మీరు ముందే ఊహించారన్న మాట. ముందుగా కాళ్ళకు బంధం, నోటికి తాళంకూడా వేస్తున్నారు. ఐతే ఆదినారాయణరావు కేసు గురించి నాకేమీ మీరు చెప్పనక్కరలేదుగాని మీరు అతనికి చేతనైనంత సహాయమేదో చెయ్యండి. అతను అమాయకుడు. ఒక్క పైసా అయినా అతను తీసుకోలేదు. ఊళ్ళో వున్న పెద్దలు, అధికారంలోనివారు అతని కేమీ భయంలేదని నమ్మించి, తాము ఆదుకుంటామని హామీ యిచ్చి ఆ డబ్బు వాడుకున్నారు. పెద్దవాళ్ళ మాట తోసివెయ్యలేక సంతకాలు పెట్టి నందుకు అతను యిరుకులో పడ్డాడు. ఏ పెద్దలైతే డబ్బు వాడుకున్నారో, వారిని తిరిగి ఆ డబ్బు యివ్వమని అడిగితే వారే యీ కేసు అతనిపై బనాయించారు. అతని భార్య తులసి నా స్నేహితురాలు. ఇద్దరం చిన్నప్పట్నుంచీ చదువుకున్నాం. మొన్న సినిమాహాలులో చూసి గుర్తుపట్టి పలకరించింది. నేను ఫలనా అని తెలుసు కుని దాని ప్రాణం లేచివచ్చింది. ఈ వేళ మన యింటికి వచ్చి విషయమంతా చెప్పి మరీ మరీ ప్రాధేయపడుతూ అడిగింది. ఈ ఒక్క ఉపకారం దానికి చెయ్యలేకపోతే నా జన్మ వృథా అని పించింది. దానికి మాట యిచ్చాను. దాని బాధ చూసి యివ్వకుండా వుండలేక పోయాను. నా మాట నిలబెట్టండి. మీరు ఎలాగైనా యీ ఉపకారం నా గురించి చేసితీరాలి. ఇది మన ఇద్దరి మధ్యన వ్యవహారం. ఎవరికీ తెలియదు." అని అంటూ శాంతమ్మ గభాల్న లేచి సుందర రామయ్య చేతులు పట్టుకొంది. ఈ మాటలు అంటూన్నప్పుడు ఆమె గొంతు వొణికింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిలి చాయి.

సుందరరామయ్య ఆమెను విదిలించు కొని తన పడకగదిలోకి వెళ్ళిపోయాడు. అతనికి కోపం వస్తే, తనకు యిష్టంలేని పని చెపితే అలాగే వెళ్ళిపోతాడు. ఎందు వల్లనంటే అవతలివాళ్ళు వాళ్ళ పట్టు విడువరు. తను తన అభిప్రాయం మార్చుకోడు. ఇక అటువంటి పరి స్థితిలో వృథా కలహప్రసంగంతో కాలం వ్యర్థ పుచ్చాలి. పట్టుదలలు హెచ్చిన తర్వాత ఎవరు ఎవరిని నొప్పిస్తారో తెలి యదు. అందుకనే ఆయన ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు. శాంతమ్మ ఆ రోజున వరండాలో మంచం వాల్చుకొని పడు కుంది. తాను అనుకున్నట్లుగానే వ్యవ హారం మొదట్లోనే బెడిసిపోయిందని ఆమె బాధపడింది.

సుందరరామయ్య పడుకున్నాడన్న మాటేగాని అతనికి నిద్రపట్టలేదు. అతని ఆలోచనలన్నీ శాంతమ్మ కోరిన అసాధ్య మైన కోరిక పైపూ, తన ఉద్యోగధర్మం

వైపూ సుళ్ళు తిరిగాయి. తను యీ ఉద్యోగంచేసి అందరికీ దూరమవుతున్నా డేమోననే ఆలోచన కలిగింది. శాంతమ్మ కోరిక తను తిరస్కరించక తప్పలేదు గదా అని బాధపడ్డాడు. శాంతమ్మ తన తత్వం తెలిసివుండీ తన స్నేహితురాలికి మాట యిచ్చివుంటే అది చాలా అవివేక మనిపించిం దతనికి.

తను ఉద్యోగంలో చేరిన ఒక సంవత్సరానికి తన భార్య తనని దెప్పిపొడుస్తూ, అవినీతికి ప్రోత్సహిస్తూ మాట్లాడిన మాటలు అతనికి జ్ఞాపకం వచ్చాయి. 'మీ కోర్టులో హాజరయ్యే ప్రొహిబిషన్ పెట్టే ఆఫీసరూ, శానిటరీ యిన్‌స్పెక్టరూ, ఫారెస్టరూ మీ కంటె ఎక్కువ సంపాదిస్తున్నారు. మీకు యీ కడిగిన జీతంరాళ్ళు తప్పించి యింకేమీ లేదు. ఒకరు బియ్యం బస్తా, యింకొకరు కర్రలూ, బొగ్గులూ పంపిస్తే తిరిగగొట్టేశారుట. మనం ఎన్నాళ్ళయినా యిలాగ నీతివాక్యాలు వల్లించుకుంటూ గొడ్డుతోకలా ఎదుగూ, బొదుగూ లేకుండా వుండవలసిందేనా?' అని అడిగింది.

మరొకసారి ఏదో మహిళా మండలి పార్టీకి వెళ్ళమంటే 'మీ ఉద్యోగం హోదా తప్పించి నాకేముంది? మంచి పట్టుచీరలూ లేవు పుస్తెలతాడు తప్పించి. మీ జీతం యీ ధరల్లో మన కుటుంబ ఖర్చుకి సరిపోతోంది. ఏదో రకంగా జీవితం వెళ్ళబుచ్చేవారికి పార్టీ లెందుకంట?' అని దెప్పిపొడిచింది.

తన ఆదాయం తక్కువగా వున్నదని దెప్పిపొడిచి మనసు నొప్పించి ఏదో విధంగా అన్యాయార్జితానికి తాను ఒడబడేటట్లు చేయడమే శాంతమ్మ అభిప్రాయమని తనకి తెలుసు. కాని ఆమె తనను ఎంతగా గాయపరచినా, ఎంత కించపరచినా డబ్బుకి తను లొంగలేదు. అన్యాయార్జితం వైపు తను మొగ్గలేదు. శాంతమ్మకు తన లక్ష్యమేమిటో, తన విధాన మేమిటో చెప్పాడు. ఐతే తన ఆదర్శాలు ఆమెను సంతృప్తిపరచలేదు. తనను బ్రతుకుతెరువు తెలియని, లౌక్యంలేని మనిషిగా నిర్ధారణచేసి, నిరాశ చేసుకొని వూరుకొన్నది.

మళ్ళీ యిన్నాళ్ళకు శాంతమ్మ తన స్నేహితురాలికి సహాయమంటూ కొత్త దండయాత్ర ప్రారంభించింది. ఈ కేసు చాలా గడ్డుకేసు. ముద్దాయి నేరాన్ని ఋజువుచేస్తూ ఒక ముఖ్యమైన కాగితం వున్నది. ఆ కాగితాన్ని, అందులోని సంగతులను త్రోసిపారేసి మరో విధంగా తీర్పుచెప్పడం ఎవరి తరమూ కాదు. ఈ కేసులో తను శాంతమ్మ కోరికకు లొంగిపోతే తన పతనం ప్రారంభమైనట్టే. ఈ కేసు తెల్లవారితే ఆర్గ్యుమెంట్లు వినడానికి వున్నది. ఏమైనా సరే యీ వ్యవహారంలో నిర్మొగమాటంగా, కఠినంగా వుండాలని నిశ్చయించుకొని నిద్రాదేవి ఒడిలోకి ఒరిగిపోయాడు సుందరరామయ్య.

మరునాడు సాయంత్రం కోర్టునుంచి యింటికి రాగానే శాంతమ్మ అడిగింది భర్తను, "ఆదినారాయణరావు కేసులో ఆర్గ్యుమెంట్లు అయినవా, కేసు ఏ విధంగానైనా పోవడానికి అవకాశ మున్నదా" అని.

సుందరరామయ్య బట్టలు మార్చు కొని వచ్చి చెప్పాడు. "నేను ఆర్గ్యుమెంట్లు వినలేదు. వినదల్చుకోలేదు. ఆ కేసుని నా కోర్టునుంచి మరేవూరి కోర్టుకైనా ట్రాన్స్ఫరు చెయ్యమని జిల్లా జడ్జిగారికి యీ రోజునే ఉత్తరం వ్రాశాను."

"మా ఆవిడ యీకేసులో ముద్దాయికి సాయంచెయ్యమని రికమెండు చేసిందని కూడా రాశారా?" అని అడిగింది శాంతమ్మ కొంత హేళనగా, కొంత ఉక్రోషంగా, తన భర్త తన స్నేహితు రాలి భర్తకు ఉపకారం చెయ్యకుండా, తెలివిగా తన చేతిలో ఏమీ లేకుండా చేసుకొన్నందుకు.

"అలాగ వ్రాయలేదు గాని, కేసు ట్రాన్స్ఫరు చెయ్యమని వ్రాయడానికి ఏదో ఒక కారణం చెప్పాలి గదా. స్థానికంగా యీ కేసులో యితరులు కలుగ జేసుకొని వత్తిడి తెస్తున్నందువలన నేను న్యాయం చెయ్యలేనేమోనని అను మానం కలుగుతున్నందువల్ల యీ కేసుని మరో కోర్టుకి ట్రాన్స్ఫరు చెయ్య మని వ్రాశాను. ఈ పద్ధతే నాకు ఉభయ తారకంగా కనిపించింది. ఒకటి నేను శిక్ష వెయ్యవలసివస్తే నీ స్నేహితురాలి భర్తకు నా చేతులతో నేను శిక్షవేశాననే నింద నువ్వు, నీ స్నేహితురాలు వెయ్య కుండా తప్పించుకున్నవాణ్ణయాను. రెండు–నా అంతరాత్మకి విరుద్ధంగా కేసు కొట్టివేయవలసిన పరిస్థితి లేకుండా చేసుకున్నాను. అంటే ఒక విధంగా నీవు కోరిన కోరికను నేను మన్నించలేదనే బాధ లేకుండా చేసుకున్నాను."

శాంతమ్మకు యీ మాటలు వింటూంటే సంతోషించాలో, ఏడవాలో తెలియలేదు. తన భర్త పిరికిపని చేసి, ఏదో ఘనకార్యం చేసినట్లుగా, తన మాటకు విలువ వుంచి అది నేరవేర్చి నట్లుగా చెప్పుకోవడం ఆమెకు చాలా కోపం తెప్పించింది. ఆమె యిక నేమీ మాట్లాడకుండా విసురుగా లోపలికి వెళ్ళి పోయింది. ఆ తర్వాత లోపల ఏవో పళ్ళాలు, చెంబులూ పడిపోయిన శబ్దం అతనికి వినిపించింది. శాంతమ్మ తన చర్యపట్ల సంతృప్తి చెందలేదని సుందరరామయ్య గ్రహించాడు.

* * *

ఆ తర్వాత మూడు నెలలకు సుంద రామయ్యకు ఆ జిల్లాలోనే కొత్తవలస బదిలీ అయింది. సుందరరామయ్యను ఏ వూరు ట్రాన్స్ఫరు చేస్తే ఆ వూరు వెళ్ళి పనిచేస్తాడు. కొంత మంది గవర్నమెంటు ఉద్యోగస్తుల్లాగ ఆ



యువ



ట్రాన్స్ఫరు చేసిన వూరు బాగులేదనిగాని, మంచిదికాదని గాని, నీళ్ళు పడవని గాని ఏవో వంకలుపెట్టి శలవు పెట్టడు. గవర్నమెంటు ఏ వూళ్ళో పని చెయ్యమంటే అక్కడే చెయ్యాలని అతనికో సిద్ధాంతం. అలాగే కొత్తవలసలో చార్జి పుచ్చుకొన్నాడు.

ఐతే తాను యింతకు ముందు పని చేసిన వూరు నుంచి ఆదినారాయణరావు కేసు కొత్తవలస ట్రాన్స్ఫరు అయిందని అతనికి తెలియకపోలేదు. కాని మూడు నెలలలోను ఆ కేసు తెమిలిపోయి వుంటుందనుకొన్నాడు.

కొత్తవలస వెళ్ళిన నాల్గు రోజులకు శాంతమ్మ ఆదినారాయణరావు కేసు ప్రసక్తి మళ్ళీ తెచ్చింది.

"తులసి యీ వూళ్ళోనే వుందండి. మనం యీ వూరు వచ్చామని తెలిసి యీ వేళ మన యింటికి వచ్చింది." అన్నది శాంతమ్మ.

"తులసి ఎవరు ?" అన్నాడు సుందర రామయ్య ఆమె ఎవరై వుంటుందా అని ఊహించకుండానే.

"ఆదినారాయణరావుగారి భార్యండీ. నా స్నేహితురాలు. ఆ కేసు యింకా తీర్పు అవలేదుట గదా !" అన్నది.


"అవును. ఆ కేసును నేను వదిలించు కుందామన్నా, ఆ కేసు నన్ను వదలడం లేదు. నిన్న మీ స్నేహితురాలు వదల నట్లుంది. ఈ కేసును మళ్ళీ యిక్కడ నుంచి ట్రాన్స్ఫరు చేసెయ్యమని జిల్లా జడ్జికి రాసేస్తాను." అన్నాడు సుందర రామయ్య.

"పోనీలెద్దురూ, మీకెందు కంత పంతం. ధర్మం అశగాలా నాలుగు పాదాలా మీ మూలంగానే నడుస్తోందని మీరనుకుంటే మీకు తోచినట్టు చెయ్యండి. ఈ కేసు ప్రసక్తి తీర్పు అయేవరకూ మీ దగ్గర ఎత్తను; సరా" అన్నది. సుందరరామయ్యకు ఆమె ధోరణిలో ఏదో మార్పు కనిపించింది. ఇదివరకు లాగా అదే పనిగా ఉపకారం చెయ్యమని ప్రాధేయపడుతూనో, కోపంగానో అడ గక పోవడం అటనికి ఆశ్చర్యం కలి గించింది.

సుందరరామయ్య శాంతమ్మ మాట లక్ష్యపెట్టలేదు. మళ్ళీ జిల్లాజడ్జికి ఆ కేసును మరొక కోర్టుకు ట్రాన్స్ఫరు చెయ్యమని వ్రాద్దామనే నిశ్చయంతో కేసుఫైలు తెప్పించి చూశాడు. అందులో ఒక ముఖ్యమైన కాగితం కనపడలేదు. సుందరరామయ్యకు భూమి కంపించిన ట్లయింది.ఆ కాగితమే ఆదినారాయణరావు దోషి అని ఖచ్చితంగా నిర్ధారణ చేసే కాగితం. ఆ ఎగ్జిబిట్ ఏమైందని బెంచి గుమస్తాని పిలిచి అడిగాడు.

బెంచి గుమస్తా తనకి తెలియదనీ, ఆ వూరు కేసు రికార్డు వచ్చేనాటికి అది లేదనీ చెప్పాడు.

సుందరరామయ్యకు ఏమి చెయ్యడా నికీ పాలుపోలేదు. తను యీ విష యాన్ని జిల్లా జడ్జిగారి నోటీసుకి తీసుకు వెడితే యిద్దరు గుమాస్తాలకు గాని, లేదా ఒక వూళ్ళో గుమాస్తాకు గాని ఉద్యోగం బర్తరఫ్ అవుతుంది. ఇందులో యితరుల ప్రమేయం హెచ్చుగా వున్నట్లు కనపడింది. కేసు ఏ వూరునుంచి ట్రాన్స్ఫరు అయి వచ్చిందో ఆ వూళ్ళో బెంచి గుమాస్తాకు గాని, కొత్తవలసలో బెంచి గుమాస్తాకు గాని యిద్దరిలో ఎవరో ఒకరికి యీ కాగితం ఎలా పోయినదీ తెలిసివుండాలి. ఈ యిద్దరిలో ఎవరు నేరస్తులో కను క్కోవడం అంత సులభమైన పనికాదు. ఈ నేరం పై అధికారుల దృష్టికి తీసుకు వస్తే నిజంగా నేరంచేసినవాడే శిక్షకు




గురిఅవుతాడనే నమ్మకం లేదు. ఒక వేళ యిద్దరు గుమాస్తాలనూ శిక్షిస్తే నేరంచేసినవాడితో బాటు అమాయకుడికి కూడా శిక్షపడడం జరుగుతుంది. అసలు కేసుమీద దృష్టి కేంద్రీకరించకుండా పిల్లసమేరీ లాగ యిదో కొత్త సమస్య వచ్చిపడింది. సుందరరామయ్యకు ఏమీ పాలుపోలేదు. ఆ రాత్రంతా ఆలోచిస్తూనే గడిపాడు. తెల్లవారగట్ల ఏదో విధంగా ఒక నిర్ణయానికి వచ్చి ఒకగంట కన్నుమూశాడు.

తర్వాత మరో పది రోజులకు సుందరరామయ్య కోర్టునుంచి సాయంత్రం యింటికివచ్చి శాంతమ్మను పిలిచి, ఆదినారాయణరావు కేసును కొట్టివేశానని చెప్పాడు. ఆ మాట విని శాంతమ్మ చాలా సంతోషించింది. కాని ఆశ్చర్యపోవలసినంతగా ఆశ్చర్యపడకపోవడం సుందరరామయ్యకు వింతగా కనపడింది.

"పోనీయండి నా కోరిక ఆ వూళ్ళో తీర్చకపోయినా యీ వూళ్ళో తీర్చారు. మా తులసి చాలా సంతోషిస్తుంది. మీ మేలు ఆ భార్యాభర్తలు జన్మజన్మలకీ మరచిపోరు. మీరు యీ కేసు యిక్కడి నుంచి కూడా ట్రాన్స్ఫరు చేయమని వ్రాస్తారేమోనని అనుకున్నాను. ఈ కేసు మీ చేతులతో మీరే కొట్టివేశారంటే నాకు ఆశ్చర్యంగానే వుంది" అన్నది.

"ఒకరికి సంతోషం కలిగిద్దామనిగాని, ఎవరికో ఒకరికి మేలు చేద్దామనిగాని, నీ కోరిక తీర్చుదామనిగాని నేను యీ కేసులో యీ విధంగా తీర్పు చెప్పలేదు. నా యిష్టానికి వ్యతిరేకంగానే యీ తీర్పు యిలా చెప్పవలసి వచ్చింది. నేను

అనుకున్న దొకటీ, అయినది యింకొకటీ అయింది. అందుకే విధి బలీయమంటారు. నేను చట్టాన్ని యధాతధంగా అమలుజరుపగలను అని అనుకోవడం, మొండిగా ఒక నమ్మకానికి అంకితమైపోవడం గూడా అసాధ్యమౌతుందని నాకు తెలియడానికి యిన్నాళ్ళు పట్టింది." అన్నాడు సుందరరామయ్య బాధగా.

"పోనీలెద్దురూ ఒక కేసులో చెప్పిన తీర్పు గురించి అలా బాధపడి పోతారెందుకు ? మీరు యిప్పటికి ఎన్ని వేల కేసులు, దావాలలో తీర్పు చెప్పారో, ఒక్కటి గూడా పొల్లుపోలేదని, అన్నీ సక్రమంగానే వున్నాయని ఏం నమ్మకం? హాయిగా కాఫీ తాగి అలా షికారు వెళ్ళి రండి." అని అంటూ శాంతమ్మ కాఫీ తెచ్చి యిచ్చింది.

సుందరరామయ్య ఊరి బయటకు దూరంగా ప్రశాంత పరిసరాలలోకి షికారు వెళ్ళాడన్నమాటేగాని, తాను ఆ రోజున చెప్పిన తీర్పులోని మంచి చెడ్డలు, పూర్వాపరాలు అతని ఊహాపథంలో చికాకు కలగజేస్తూనే వున్నాయి. తన భార్య ఆమె స్నేహితురాలి భర్త జీవితం పాడయిపోతుందని జాలిపడి సహాయం చెయ్యమని అర్ధిస్తే ఆ అభ్యర్ధన తన పద్ధతికి విరుద్ధమనీ, అలాగ సహాయం చేసే అవకాశం లేదనీ తలచి ఆ కేసులో తీర్పు చెప్పే బాధ్యతనే ఒకానొకసమయంలో వదిలించుకున్నాడు. కాని ఆ కేసులో తనే తీర్పు చెప్పవలసిన పరిస్థితి తప్పలేదు. మారిన పరిస్థితులలో తన క్రింది తాబేదారులలో ఎవరో ఒకరికి అపకారం జరుగుతుందని జాలిపడి, అనవసరంగా పరిస్థితిని రచ్చకెక్కించడం యిష్టంలేక తన క్రింద పనిచేసేవారిని రక్షించడం కోసం అది నారాయణరావు మీద కేసులో తనకు యిష్టంలేకపోయినా అతనికి సహాయం చేశాడు. న్యాయశాస్త్రంలో నూరు మంది నేరస్తులను వదిలిపెట్టినా ఫరవాలేదు, ఒక అమాయకుడికి మాత్రం శిక్ష విధించగూడదనే సిద్ధాంతం వున్నది. తన తాబేదారులలో ఒక అమాయకుడికి శిక్షపడుతుందేమోననే భయంతో, ఒక నేరస్తుడిని వదిలిపెట్టడం జరిగింది. తాను జీవితంలో ఎన్నడూ చేస్తానని ఊహించలేని పనిని విధి తన చేత చేయించింది. అందుకే గాబోలు అనుభవజ్ఞులు విధి బలీయమన్నారు అనుకున్నాడు సుందరరామయ్య.